క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత




చెక్కు అందజేస్తున్న మేనేజర్ ప్రవీణ్

సుజాతనగర్: అనారోగ్యంతో మృతి చెందిన ఓ బాధిత కుటుంబానికి పీఎంజేజేబీవై నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఇన్సూరెన్స్ చెక్కును ఏపీజీవీబీ మేనేజర్ ప్రవీణ్ సోమవారం అందజేశారు. జూలూరుపాడు మండలం, కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ బుజ్జి అనే మహిళకు స్థానిక ఏపీజీవీబీ బ్యాంకులో ఖాతా ఉంది. 6 నెలల క్రితం ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. రూ.436 ఇన్సూరెన్స్ చెల్లించడంతో మహిళ పథకానికి అర్హురాలైంది. ఈ నేపథ్యంలో మృతురాలి పేరు మీద మంజూరైన చెక్కును ఆమె భర్త కిషన్‌కు బ్యాంకు మేనేజర్ అందజేశారు. కార్యక్రమంలో అకౌంటెంట్ సురేష్, క్యాషియర్ సంధ్యారాణి, సిబ్బంది అరుణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల శాసనమండలికి జరగనున్న ఎన్నికలలో ముస్లిం పట్టభద్రులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. 2020 నవంబర్‌కు ముందు డిగ్రీ, తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన వారు అర్హులని, మంగళవారం సాయంత్రం వరకు డిగ్రీ సర్టిఫికెట్, ఓటర్, ఆధార్ కార్డు, పాస్ ఫొటోతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, సంబంధిత జిరాక్స్ పత్రాలపై గెజిటెడ్ అధికారి చేత అటెస్ట్ చేయించి తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయంలో సమర్పించాలని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఈసారి తప్పక నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రాథమిక స్థాయి విద్య ముఖ్యం



మాట్లాడుతున్న ప్రభుదయాళ్

సింగరేణి(కొత్తగూడెం): ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులు మానసిక, శారీరక ఎదుగుదల ముఖ్యమని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కొత్తగూడెం నోడల్ అధికారి డాక్టర్ ప్రభుదయాళ్ అన్నారు. సోమవారం ఆయన క్లస్టర్‌లో టీచింగ్ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయి విద్య పునాదులని, విద్యార్థుల ఎదుగుదలకు కారణమవుతుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాల గుర్తింపు, వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్లస్టర్ తరగతుల్లో పలు సూచనలు, సలహాలు చేశారు. రామవరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలలు, వార్షిక పర్యవేక్షణకు రికార్డులను సిద్ధ చేసుకోవాలని, త్వరలో ప్రతి పాఠశాలను సందర్శించనున్నట్లు చెప్పారు. విద్యా ప్రమాణాల పెంపుదలకు కృషి చేయాలన్నారు.

తలుపు తీయరు.. వేడుక జరగదు

- నిరుపయోగంగా ఐటీడీఏ ఫంక్షన్ హాల్
- ఇల్లెందులో రూ.1.10 కోట్లతో నిర్మాణం
- ఇప్పటికీ తలుపులు తీయకపోవడంతో పడావు
- మున్సిపాలిటీకి అప్పగించాలని ఐటీడీఏ పీఓకు సిఫారసు



నిరుపయోగంగా మారిన గిరిజన భవనం ఇదే..

ఇల్లెందు: గిరిజనులు పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలను ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో నిర్వహిస్తూ రూ.వేలల్లో అద్దె చెల్లించాల్సి వస్తోంది. అలా కాకుండా నామ మాత్రపు ధరకు అద్దెకు ఇచ్చేలా రూ.1.10 కోట్ల వ్యయంతో ఇల్లెందులో నిర్మించిన ఫంక్షన్ హాల్ (గిరిజన భవనం) తలుపులు ఏళ్లుగా తెరుచుకోవడం లేదు. ఇదెక్కడో మారుమూల పల్లెలో కాదు. ఇల్లెందు పట్టణ నడిబొడ్డున నిర్మించి వదిలేసిన అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇల్లెందులోని కొత్త కాలనీ సమీపాన సుదిమళ్ల గిరిజన బాలికల గురుకులం వెనుక క్రితం ఐటీడీఏ ఆధ్వర్యాన ఫంక్షన్ హాల్ నిర్మించి ప్రారంభించినా అందుబాటులోకి తీసుకురాలేదు. పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లతో పాటు సింగరేణి పరిధిలోని క్లబ్‌లు సీజన్లలో కళకళలాడుతున్నా గిరిజన భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలన్న ఆలోచన ఏ అధికారీ చేయడం లేదు. ఫంక్షన్లకు అద్దెకు ఇవ్వకున్నా ప్రభుత్వ కార్యక్రమాలు అయినా నిర్వహించుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా పట్టించుకోకపోవడంతో భవనం పడావు పడుతోంది. అయితే, బోర్ వేసినా నీరు పడలేదని చెబుతున్న అధికారులు నామమాత్రమే ధరతో మున్సిపాలిటీ ట్యాంకర్ల ద్వారా తెప్పించే అవకాశమున్నా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

మున్సిపాలిటీకి అప్పగిస్తే ఉపయోగం..

గిరిజన భవనం నిర్వహణ ఐటీడీఏ అధికారులకు భారంగా మారుతుందనుకుంటే మున్సిపాలిటీకి అప్పగించినా ఉపయోగంలోకి వస్తుంది. ఈ భవనానికి 2016 నవంబర్ 29న ఆనాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయగా రెండేళ్ల అనంతరం నిర్మాణం పూర్తయింది. ఆ తర్వాత హడావుడిగా ప్రారంభించిన అధికారులు.. సభలు, సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకునే వీలున్నా పట్టించుకోవడం లేదు. కేవలం నీటి సదుపాయం లేకపోవడం... మరోవైపు హాల్ పర్యవేక్షణ బాధ్యతలు ఎవరికీ అప్పగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇకనైనా మున్సిపాలిటీకి అప్పగిస్తే నీరు కూడా వారే సరఫరా చేస్తూ అద్దెకు ఇచ్చే అవకాశముంటుంది.

గిరిజన భవనంలో దుపాయాలు ఇలా ...

ఇల్లెందులోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో నిర్మించిన ఈ ఫంక్షన్ హాల్(గిరిజన భవనం)లో సుమారు వెయ్యి మంది కూర్చునే సామర్థ్యం ఉంది. శుభకార్యాలు నిర్వహించుకునేందుకు వేదిక, సభలు సమావేశాలు నిర్వహించుకునేందుకు సభావేదిక కూడా నిర్మించారు. ఇక విశ్రాంత్రి కోసం రెండు గదులు, వంటశాలలు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, చుట్టూ ప్రహరీ నిర్మించి నందున ఫంక్షన్ హాల్‌ను ఉపయోగంలోకి తీసుకువస్తే అందరికీ ఉపయోగపడుతుంది. కాగా, ఈ విషయమై ఐటీడీఏ ఏఈ సాలార్‌ను వివరణ కోరగా... గిరిజన భవన్‌లో నీటి ఎద్దడి ఉంది. అక్కడ బోర్ పడే అవకాశం లేదు. సింగరేణి అధికారులను కోరితే వారికే సరిపోనందున నీరు ఇవ్వలేమని చెప్పారు. నీటి సదుపాయం కలిగిన మున్సిపాలిటీ వారికి అప్పగిస్తే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే అవకాశం ఉంటుంది.

వినియోగంలోకి తీసుకురావాలి..



గిరిజన భవనం నిర్మించి ఏళ్ల గడుస్తోంది. గిరిజనులకు ఉపయోగపడాల్సిన ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం లేదు. అధికారులు చొరవ చూపి అన్ని వసతులు కల్పించి వాడుకలోకి తీసుకురావాలి. తద్వారా ఫంక్షన్ హాళ్లకు వెచ్చించే ఖర్చు మిగులుతుంది.

– వట్టం కన్నయ్య, ఇల్లెందు

సొసైటీకి అప్పగిస్తామన్నారు..



భవన ప్రారంభోత్సవం జరిగినప్పుడు ఆనాటి ఐటీడీఏ పీఓ సొసైటీకి అప్పగిస్తామని చెప్పారు. దరఖాస్తు చేసుకుంటే రూ.లక్షల్లో అద్దె చెప్పారు. ఇప్పటికైనా అధికారులే నడిపిస్తే అందరికీ ఉపయోగం. లేదా ఏదైనా సొసైటీకి అప్పగిస్తే నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది.

– గొగ్గెల రామస్వామి, ఇల్లెందు

జంతువులను వేటాడడం చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్‌రావు

జూలూరుపాడు: అడవి జంతువులను వేటాడడం, అడవులు నరకడం, ఆక్రమణలకు పాల్పడం చట్టరీత్యా నేరమని జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ జి.ప్రసాద్‌రావు అన్నారు. సోమవారం సురారం గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. అడవిలో అక్రమంగా చెట్లు నరకడం, వ్యవసాయం కోసం కొత్తగా పోడు నరకరాదన్నారు. అడవిలోకి వెళ్లే వారు అగ్గిపెట్టెతో వెళ్లరాదని, అగ్ని ప్రమాదంతో కాలిపోతే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని చెప్పారు. అటవీ సమీపంలోని రైతులు పొలాల్లోని వ్యర్థాలను కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీశాఖ చర్యలు తీసుకుంటుందని, దీనికి ప్రజలంతా సహకరించాలని కోరారు. అటవీ నేరాలకు పాల్పడితే ఎలాంటి చట్టాలు, శిక్షలు ఉంటాయో ప్రజలకు వివరించారు. అడవులకు ఎలాంటి నష్టం కల్గించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పచ్చదనం కోసం మొక్కలు పెంచాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ధనలక్ష్మి, ఎఫ్‌బీఓలు బి.నరసింహారావు, శ్రీలత, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, బానోత్ హరిలాల్, చింతా జగన్నాథం పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన

చుంచుపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెనగడప పరిధిలో సోమవారం రుద్రంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, గ్రామస్తులకు పెనగడప హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.పూర్ణారావు కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్పర్శ లెప్రసీ జాతీయ కార్యక్రమం గురించి పూర్తిస్థాయిలో వివరించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం, టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జూలూరుపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ లావుడ్యా సోని అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి కేపీఎల్ క్రికెట్ టోర్నీ

టేకులపల్లి: కోరం కనకయ్య ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) సీజన్1 క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ఉదయం 9 గంటలకు టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా మైదానంలో ప్రారంభం అవుతుందని నిర్వాహకులు బోడు మంగీలాల్, మూడు గణేష్, అనిల్ తెలిపారు. ఈ టోర్నీని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభిస్తారని పేర్కొన్నారు. తొలిరోజు ఉదయం 11 గంటలకు టీకేపీ టైగర్స్ – బ్యాడ్ బాయ్స్, మధ్యాహ్నం 1.30 గంటలకు వాయునందన్ – బద్దుతండా, మూడు గంటలకు పీకే11 ఓజీఎం – ఆర్‌పీ వారియర్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు సకాలంలో గ్రౌండ్‌కి హాజరు కావాలని కోరారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

పాల్వంచరూరల్: నేడు జరగాల్సిన పాల్వంచ మండల సర్వసభ్య సమావేశం అనివార్య కారణాల వలన ఈనెల 9వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, అన్నిశాఖల ప్రభుత్వ అధికారులు హాజరు కావాలని కోరారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న శాంతిరామ్

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని 1969 ప్రత్యేక తెలంగాణ సమరయోధుల సంఘం అధ్యక్షుడు వి.శాంతిరామ్ అన్నారు. సోమవారం మార్వాడి సత్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన వారి వివరాలు ప్రభుత్వ కార్యాలయాల్లో, కోర్టులు, పోలీసు స్టేషన్లలో దొరకడం లేదన్నారు. ఉద్యమకారుల రికార్డులు ఎక్కడా లేవని, ప్రభుత్వం బాధ్యత వహించి, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సమరయోధుల సంఘం నాయకులు అనంత రెడ్డి, సూర్యప్రకాశ్‌రావు, చింతలచెర్వు గెర్షోము, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయండి





ఇల్లెందురూరల్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, ఎంపీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు



టేకులపల్లి ఎంఈఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు

ఇల్లెందురూరల్: ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె ప్రచార పోస్టర్లను ఇఫ్టూ కార్యాలయంలో సోమవారం ఇఫ్టూ జిల్లా కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో చైతన్యం కలిగించడమే లక్ష్యంగా సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. అన్నివర్గాల ప్రజలు సమ్మెకు సంఘీభావం ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో కందగట్ల సురేందర్, కొక్కు సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు, తుపాకుల నాగేశ్వరరావు, భట్టు ప్రసాద్, కుంజ కృష్ణ, జక్కుల రాంబాబు, గౌని నాగేశ్వరరావు, మల్లికార్జున్‌రావు, జగంటి వెంకన్న, సామేలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వర్కర్లు..

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల16న కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెకు సంఘీభావంగా మండలంలోని గ్రామపంచాయతీ వర్కర్లు సోమవారం ఎంపీఓ చిరంజీవికి సమ్మె నోటీసు అందజేశారు.

ఈ సందర్భంగా కార్మిక సంఘాల జేఏసీ నాయకుడు జటంగి వెంకన్న మాట్లాడుతూ.. 16న కార్మికులందరూ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాకూబ్ షావలి, సారంగపాణి, సామేలు, పాయం వెంకన్న, వెంకటనారాయణ, కిరణ్, విజయ్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఈనెల 16న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జూలూరుపాడులో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం మతతత్వ విధానాలు అవలంబిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను చార్జీషీట్ ప్రకటించి ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌కు జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్, ఉద్యోగ సంఘాల అఖిల భారత ఫెడరేషన్స్, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునివ్వడం జరిగిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచి పేద, మధ్యతరగతి ప్రజలు నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక సమ్మె, బంద్‌తో దిగిరావాలన్నారు. సమావేశంలో బానోత్ ధర్మా, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేష్, తంబర్ల నరసింహారావు, పారుపల్లి బాబురావు, ఎం.కృష్ణయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వర్కర్లు..

టేకులపల్లి: ఈనెల 16న జరిగే దేశ వ్యాపిత సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో పాల్గొంటామని, తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని సీఐటీయూ, మధ్యాహ్న భోజన వర్కర్లు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం టేకులపల్లి ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ అందుబాటులో లేకపోవడంతో ఎంఐఎస్ ఉద్యోగి సంధ్యారాణికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 16న జరగనున్న సమ్మెలో పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు కడుదుల వీరన్న, ఈసం రాణెమ్మ, ఈసం నాగలక్ష్మి, మెట్ల మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ఈనెల 16న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికులు, రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ కోరారు. సోమవారం మంచికంటి నగర్‌లో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వర్లు, గడ్డమీద నాగార్జున, పాకాల వెంకటరావు, శెట్టి యశోధ, నాగమణి, పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం పట్టణంలోని కేసీఆర్ నగర్, జ్యోతినగర్, పాత పాల్వంచ, గొల్లగూడెం, సీతారాంపట్నం, కరకవాగు, పేటచెరువు, తెలంగాణ నగర్, రాహుల్‌గాంధీ నగర్, ఇందిరా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏడాదిలోగా అంతర్గత రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతీ పైసా సద్వినియోగం అయ్యేలా చేస్తానన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని నిధులు తెచ్చి గతం కంటే మిన్నగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, తహసీల్దార్ నాగరాజు, సీడీపీఓ కనకదుర్గ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా సిబ్బంది పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ఇంటర్మీడియట్ పరీక్ష పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. రిఫరెన్స్‌తో లేటర్‌ను కమిషనర్‌కు పంపిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. మూల్యాంకన కేంద్రం కొరకు ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ కృష్ణమోహన్, ట్రెజరర్ చైతన్య ఉన్నారు.

హైదరాబాద్‌కు ఆహ్వానించడంలో ఆంతర్యమేమిటి?

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిపెండెంట్ అభ్యర్థులకు నియామకపత్రాలు అందుకోవటానికి హైదరాబాద్‌లోని రవీంద్రభారతికి ఆహ్వానించటంలో ఆంతర్యమేమిటని మాజీ టీబీజీకేఎస్ రీజియల్ సెక్రటరీ కూసన వీరభద్రయ్య అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మెడికల్ బోర్డ్ ద్వారా అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల స్థానంలో వారి పిల్లలకు కారుణ్య నియమక పత్రాలు అందజేసి వీటీసీ ఉత్తర్వులు జారీ ప్రక్రియకు విరుద్ధంగా సింగరేణి సంస్థ కొత్త పద్ధతిలో నియామక పత్రాల కోసం హైదరాబాద్‌కు ఆహ్వానించటం సరైంది కాదన్నారు. దీన్ని టీబీజీకేఎస్ వ్యతిరేకిస్తుందన్నారు. అంతేకాకుండా రవీంద్రభారతిలో విచారణ కోసం రూ.1600 కేటాయిస్తే ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. ప్రస్తుతం కొత్తగూడెం నుంచి హైదారబాద్‌కు రానుపోను ఖర్చులు సుమారు రూ.3000 అవుతాయని, కంపెనీ రూ.1600 ఇచ్చి చేతులు దులుపుకోవటం సరికాదన్నారు. పాత పద్ధతిలోనే ఈ కారుణ్య నియమకాల విచారణ పక్రియ ఆ ఏరియా జీఎం పరిధిలోనే నిర్వహించాలని కోరారు. అదే విధంగా నియామక అర్హత సాధించిన 146 మంది జూనియర్ అసిస్టెంట్ నియామకాల ఉత్తర్వులు కాలయాపన చేసి నేడు ఇవ్వటం ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ యూనియన్ల పరిస్థితి అద్దం పడుతోందన్నారు.

విలీన సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నిమ్మల రాంబాబు

పాల్వంచ: మార్చి 3న ఖమ్మంలో జరగనున్న మూడు విప్లవ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఖమ్మంలో పార్టీ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి రిమాండ్ చేయడం సరికాదన్నారు. తక్షణమే విడుదల చేసి కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంశ్రీనివాస్, పగిడిపల్లి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన



ఓటు నమోదు దరఖాస్తులను ప్రదర్శిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

టేకులపల్లి: 2020 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారందరూ తప్పకుండా ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పూనెం నర్సయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం టేకులపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో గంగారం ఆశ్రమ పాఠశాల, ముత్యాలంపాడు ఉన్నత పాఠశాలల్లో ఫారం 18 దరఖాస్తులను అందజేసి ఎమ్మెల్సీ ఓటుపై అవగాహన కల్పించారు. మంగళవారం చివరిరోజు అని తెలిపారు. కొత్తవారే కాకుండా గతంలో ఓటు ఉన్నవారు కూడా ఓటు నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమలలో జిల్లా ఉపాధ్యక్షుడు టి.రవీందర్ ముత్యాలంపాడు ప్రధానోపాధ్యాయులు రాంచందర్ సింగ్, జిల్లా కార్యదర్శి కే.ప్రసాద్, మండల అధ్యక్షులు జి.మోతిలాల్, నాయకులు రాజేష్ ఖన్నా, మంగీలాల్, కృష్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తే లక్ష్యం



మాట్లాడుతున్న ఏరియా జీఎం శాలెంరాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2000 పరిశ్రమలకు బొగ్గును రవాణా చేస్తోంది. సంస్థపై వినియోగదారులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి నాణ్యమైన బొగ్గును అందించేందుకు ఈ మల్టీ డిపార్ట్‌మెంట్ ముఖ్య ఉద్దేశ్యమని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెంరాజు అన్నారు. సోమవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్ ఓసీలో మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అయన మాట్లాడుతూ... వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేసేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. దానిలో భాగంగా ఏరియాకు నిర్దేశించిన లక్ష్యాన్ని రక్షణతో సమైఖ్యంగా, సమర్థవంతంగా, సక్రమంగా, నిజాయితీతో నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని, సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో ఈ మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్ సమావేశం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సింగరేణి వ్యాపితంగా ఉన్న 19 ఓపెన్‌కాస్ట్ గనుల్లో జేవీఆర్‌ఓసీ ఎక్కువ బొగ్గు ఉత్పత్తి చేస్తుందని, అదేవిధంగా ఏరియాలోని సమంతా ఆర్‌సీహెచ్‌పీ కూడా అత్యధికంగా బొగ్గు రవాణా చేసి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఏరియాలోని మన గని, మన బాధ్యతలను వివరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసిన సింగరేణి సీఅండ్ఎండీకి అభినందనలు తెలిపారు. ప్రతీఒక్కరు అంకితభావంతో కంపెనీ రక్షణ సూత్రాలను పాటిస్తూ సంస్థను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం డీజీఎం (ఐఈడీ) ఎస్.యోహాన్ మాట్లాడుతూ.. మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్ ముఖ్య ఉద్దేశ్యం, సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, యంత్రాల పనితనం, ఉద్యోగుల సంక్షేమంపై సంస్థ తీసుకుంటున్న చర్యలను పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీ ఆర్‌ఓసీ పీఓ ఎస్.వెంకటాచారి, ఏజీఎం ఫైనాన్స్ కే.హేనా సుమలత, ప్రాజెక్ట్ ఇంజనీర్ లక్ష్మణమూర్తి, మేనేజర్ నరసింహారావు, రక్షణాధికారి రామదాస్, సీనియర్ పీఓ కే.దేవదాసు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చిన పాలన అందించాం..



రేపల్లెవాడ గ్రామపంచాయతీ పాలకవర్గం, సిబ్బంది

ఇల్లెందురూరల్: ఐదేళ్లపాటు ప్రజలు మెచ్చిన పాలన అందించామని రేపల్లెవాడ సర్పంచ్ ఆలెం కౌసల్య, ఉపసర్పంచ్ పోటు రవి అన్నారు. మండలంలోని రేపల్లెవాడ గ్రామపంచాయతీ పాలకవర్గం ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పాలకవర్గాన్ని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో చెరగని ముద్ర వేసేలా అందుబాటులోకి తెచ్చిన సౌకర్యాలతో తమకు గతంలో ఎవరికీ దక్కని గుర్తింపు ప్రజల నుంచి లభించిందని గుర్తుచేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మోహన్, గుమస్తా మోహన్‌రావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.